A-000464

సంపుటము– IX
నెం. 1

17 నవంబరు 1997.
సోమవారం,
(శక.సం. 1919,
కార్తీకం–26)

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపములు

## అధికార నివేదిక

## విషయ సూచిక

పేజి.నెం.

1. సంతాప ప్రతిపాదన: 1
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మృతి పట్ల.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్రణాలయము కమీషనరుగారిచే శాసనసభ ముద్రణాలయము, హైదరాబాదునందు ముద్రించబడినది.

1998.

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | |
|---|---|
| సభాపతి | శ్రీ యనమల రామకృష్ణుడు |
| ఉప సభాపతి | శ్రీ ఎన్. మహమ్మద్ ఫరూక్ |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | శ్రీ ఎ. వి. సూర్యనారాయణరాజు |
| | శ్రీ జి. అప్పల సూర్యనారాయణ |
| | శ్రీమతి కె. ప్రతిభాభారతి |
| | శ్రీ కర్రాసుబ్బారెడ్డి |
| | శ్రీ డి. ఎస్. రెడ్యానాయక్ |
| | శ్రీ డి. రాజగోపాల్ |
| ప్రత్యేక కార్యదర్శి | శ్రీ సి. వెంకటేశన్ |
| కార్యదర్శి | శ్రీ ఎస్. డి. కమలాకర్ |
| ఉప కార్యదర్శులు | శ్రీ బి. వి. శర్మ |
| | శ్రీ ఎమ్. హెచ్. కేశవరావు |
| | శ్రీ కె. తుల్జానందసింగ్ |
| | శ్రీ అహమద్ అతావుల్లా |
| | శ్రీమతి టి. అంజనిబాయి |
| సహాయ కార్యదర్శులు | శ్రీ టి. వి. సత్యనారాయణ |
| | శ్రీ కె. వి. డేవిడ్ జ్ఞానకన్ |
| | శ్రీ ఖాజామొయినుద్దీన్ |
| | శ్రీ ఆర్. భాస్కరన్ |
| | శ్రీ షైకూర్ రెహమాన్ అన్సారి |
| | శ్రీ ఆర్. అంజయ్య |
| | శ్రీ సయ్యద్ అహమద్ |
| | శ్రీ ఎస్. వి. రామిరెడ్డి |
| | శ్రీమతి వి. జయకుమారి |
| | శ్రీమతి ఇంధిరాగాంధి పి. కాశిరాజు |
| చీఫ్ రిపోర్టర్ | శ్రీ వి. లక్ష్మీనారాయణ |

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

(పదవ శాసనసభ)
(పన్నెండవ సమావేశము : మొదటి రోజు)

సోమవారము, 17 నవంబరు 1997

(సభ ఉదయం 10·00 గంటలకు సమావేశమైనది)
సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు)

సంతాప ప్రతిపాదన:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మృతి పట్ల.

Mr.Speaker:- The Hon'ble Chief Minister will move the Condolence Motion.

Sri N.Chanrababu Naidu:- Mr.Speaker Sir, I beg to move:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Bodepudi Venkateswara Rao, Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family."

Mr.Speaker:- Motion moved.

సంతాప ప్రతిపాదన: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరావు మృతిపట్ల.

శ్రీ ఎన్.చంద్రబాబునాయుడు:- అధ్యక్షా, బోడేపూడి వెంకటేశ్వరరావు గారు 1924వ సంవత్సరంలో ఒక పేద రైతు కుటుంబంలో ఖమ్మం జిల్లా గండగలపాడు గ్రామంలో జన్మించారు. 5-8-97వ తేదీన వారు మరణించారు. ఆయనకు ఒక కుమారుడు నలుగురు కుమార్తెలు వున్నారు. వారి సతీమణి శ్రీమతి బి.ధనలక్ష్మి 1989వ సంవత్సరంలో మరణించారు. ఆయన ప్రాథమిక విద్య అభ్యసించే రోజులలో బడి మానివేసి, వ్యవసాయ పనులలో చేరవలసివచ్చింది ఆ విధంగా ఆయన జీవితం గురించి ఆలోచిస్తే, స్వగ్రామంలోనే వ్యవసాయ కూలీగా జీవితాన్ని ప్రారంభించి, తరువాత రాజకీయాలలో చేరడం జరిగింది. ఆయన ఎన్నో బాధలు అనుభవించారు. 14వ సంవత్సరంలోనే చదువుకు వీడ్కోలు చెప్పుకున్నారు. ఆ విధంగా అప్పటినుంచి కష్టపడి పనిచేసి, తర్వాత ఖమ్మం జిల్లాలో సి.పి.ఎం. నాయకులలో అగ్రనాయకులుగా స్థానాన్ని సంపాదించారు. చిన్నతనంలోనే కీర్తిశేషులు శేషగిరిరావు గారి వద్ద కొరియర్‌గా పనిచేస్తూ 1946వ సంవత్సరంలో కమ్యూనిస్టు ఉద్యమంలో చాలా ముమ్మరంగా పనిచేశారు 1947లో మధిర తాలుకాలో కమ్యూనిస్టు పార్టీ కమిటీ సభ్యులయ్యారు. వారు 1952 వరకూ రహస్య జీవితం గడిపారు. 1952 నుంచి అన్ని ఎన్నికలలోనూ పాల్గొని, ఆనాటి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా వున్నపుడు దాని విజయానికి కృషి చేయడం జరిగింది. అదే మాదిరిగా అప్పటినుంచి హైదరాబాదు ప్రభుత్వం ద్వారా వచ్చిన కౌలుదారీ చట్టం వల్ల వచ్చిన సమస్యలపైన 4 సార్లు పోరాటం జరిపి, వారి హక్కులను కాపాడటం కోసం కృషి చేయడం జరిగింది. మొదటి నుంచీ రైతు ఉద్యమంలో పాల్గొంటూ రైతులకు ఎనలేని సేవ చేశారు. ఆ విధంగా ఎన్నోసార్లు సత్యాగ్రహంలో పాల్గొనడం, రైతుల సమస్యలు వచ్చినపుడు వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరిగిందని మీకు తెలియజేసు కుంటున్నాను.

మధిర తాలుకాలో 24 గ్రామాలలో 1938 ఎకరాలలో బంజరు భూములు వుంటే పేద ప్రజలకు ఆ బంజరు భూములను పంచడం కోసం కృషి చేసి, అవి వచ్చేవరకూ నిరంతరం పోరాడేరని తెలియజేసుకుంటున్నాను. ఈనాం పట్టాలు యిచ్చే సందర్భంలో అన్యాయం జరిగితే ఎదిరించి, న్యాయం జరిగేలా చూశారు. అంతే కాకుండా 1974లో రైల్వే సమ్మె సందర్భంగా మరియు 1975లో అత్యవసరపరిస్థితి సందర్భంగా జైలుకు కూడా పోవడం జరిగింది. అదే మాదిరిగా సి.పి.ఎం. పార్టీకి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా, రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులుగా పనిచేయడం జరిగింది. ఆ విధంగా ఎన్నో పదవులు నిర్వహించి న్యాయం చేస్తూ, పేదప్రజలకు న్యాయం చేయడం జరిగింది 1985, 89, 94 ఈ మూడు సార్లు మధిర నియోజకవర్గంలో కంటెస్టు చేసి సి.పి.ఎం. అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. సభలో కూడా శాసనసభ ఉపనాయకుడిగా కొన్ని రోజులు వుండటం, తరువాత శాసనసభలో నాయకులుగా పని చేశారు. ఆ విధంగా వారు జీవితాంతం అవిశ్రాంతంగా పనిచేస్తూ, పేద ప్రజలకోసం ఎనలేని సేవ చేసిన విప్లవకారుడిగా పేరు తెచ్చుకున్నారు.

ఈ హౌస్‌లో చూశాము. సి.పి.ఎం. ఫ్లోరు లీడరుగా వుండి, ప్రతిరోజు ప్రజల సమస్యలను సభ ముందుకు తీసుకురావడం, ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరిగింది. సభలో ఒక్కొక్కసారి క్లిష్టమైన పరిస్థితులు వచ్చినపుడు ఒక పెద్ద మనిషిగా అందరినీ కలిపి క్రైసిస్ లేకుండా సభ జరగడానికి న్యాయబద్ధంగా ఎన్నో సందర్భాలలో యాక్ట్ చేయడం జరిగింది. నిర్మొహమాటంగా హౌసులో వారు చెప్పడం చూశాము. ఒక పెద్దమనిషిగా ఉండటమే కాకుండా విషయం వచ్చినపుడు చాలా నిర్మొహమాటంగా సమస్యలపైన పోరాడి, రాజీలేని పోరాటం చేశారు. అదే మాదిరిగా హౌస్‌లో ఒక ఫ్లోరు లీడరుగా ఎంతో హుందాగా డిగ్నిటీతో, సంయమనంతో ఒక పెద్దమనిషిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన చనిపోయేటంతవరకూ పేద ప్రజల కొరకు పని చేశారు. ఆయన చనిపోయే ముందు రోజు కూడా ప్రజల కొరకు ఎన్నో గ్రామాలు తిరిగి రాత్రి లేటుగా వచ్చి పడుకున్నారు. ఆ రోజు రాత్రి లేటుగా రావడం వల్ల ప్రతిరోజూ మాదిరి మార్నింగు వాక్‌కు వెళ్ళలేదు. బాత్రూమ్‌లోకి స్నానం చేయడానికి వెళ్ళినపుడు తీవ్రమైన హార్ట్‌ఎటాక్ రావడం వల్ల వారు చనిపోయారు. ఆ విధంగా ఆలోచిస్తే, జీవితం కడవరకూ, కడ శ్వాస వదిలేంతవరకూ కూడా ప్రజల కోసం పోరాడిన వ్యక్తి బోడేపూడి వెంకటేశ్వరరావు గారు అటువంటి వ్యక్తి లేకపోవడం ఈ హౌసులోనే కాదు, రాష్ట్రప్రజానీకంలో గానీ, ఖమ్మం జిల్లాలో గాని, కమ్యూనిస్టు పార్టీలో గాని, మధిర నియోజకవర్గంలో గాని ఎవరూ వారి స్థానాన్ని భర్తీ చేయలేరని తెలియజేసుకుంటున్నాను. ఏది ఏమయినప్పటికీ, వీరు ఏ ఆశయాల కొరకైతే పోరాడేరో వారి కోసం మనం పని చేయాల్సిన అవసరం వుంది.

నాకు బాగా జ్ఞాపకం మధిర నియోజకవర్గంలో ఫ్లోరైడ్ కంటెంట్ వుంటే సెంట్రల్ గవర్నమెంటు నుంచి ఒక సబ్మిషన్ ప్రాజెక్టు కోసం వారు పోరాడేరు. ఆ విధంగా రూ.24 కోట్లతో ప్రాజెక్టు వచ్చింది. వారి జ్ఞాపకార్థం, ప్రజలు గుర్తు పెట్టుకోవడం కోసం ఈ వాటర్ స్కీముకు బోడేపూడి వెంకటేశ్వరరావు స్కీముగా పేరు పెట్టాలని అనుకుంటున్నాను. ఒక మంచి నాయకుడిని పోగొట్టుకున్నందుకు బాధపడుతూ. కమ్యూనిస్టు పార్టీ మిత్రులు యింకా ఏదైనా చెబితే చేయడానికి సిద్ధంగా వున్నాము సమాజంలో మంచి పనులు చేసినపుడు అటువంటి వ్యక్తులను శాశ్వతంగా గుర్తు పెట్టుకోగలిగితే, రాబోయే జనరేషన్‌లో మంచి స్ఫూర్తి వస్తుందని ఈ ప్రతిపాదన చేశాను. చివరగా, ఆయన లేని లోటు ఉన్నప్పటికీ, వారి కుటుంబ సభ్యులకు వారి పార్టీ సభ్యులకు, వారి సన్నిహితులకు, స్నేహితులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసుకుంటూ, వారి ఆత్మశాంతి కొరకు భగవంతుడిని ప్రార్థిస్తూ, మీ దగ్గిర సెలవు తీసుకుంటున్నాను

శ్రీ పి.జనార్ధన్‌రెడ్డి (ఖైరతాబాద్):- అధ్యక్షా, బోడేపూడి వెంకటేశ్వరరావు గారి మరణం రాష్ట్రానికి తీరని లోటు అని మనవి చేస్తున్నాను. వారు పేద రైతు కుటుంబంలో జన్మించి, ఒక బడి పంతులుగా వారి జీవితాన్ని ప్రారంభించి, రైతులకు, కార్మికులకు చేసిన సేవ మరవలేనటువంటిది. వారు జన్మించిన 14 సంవత్సరాల తరువాత వారు తండ్రిని

కోల్పోవడం జరిగింది. కుటుంబ బాధ్యత వారిపై వచ్చినపుడు, రైతు కూలీగా, బడిపంతులుగా కష్టపడి కుటుంబసభ్యులను పోషించడం జరిగింది. అంతేకాకుండా కమ్యూనిస్టు రైతాంగపోరాటంలో వారు చురుకుగా పాల్గొన్నారు. 1949లో విజయవాడలో జరిగిన రైతు మహాసభకు వారి స్వగ్రామం నుండి కాలినడకన బయలుదేరి 20 మంది రైతులను వెంటతీసుకువెళ్లడం జరిగింది. స్వాతంత్ర్యం రావడానికి ముందు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఎన్నోసార్లు జైలుకు వెళ్లడం జరిగింది. వారు మన శాసనసభకు మూడు సార్లు ఎన్నుకోబడి, సి.పి.ఎం. ద్వారా లీడరుగా ఎన్నుకోబడి, చక్కగా పని చేస్తూ, మాకు యిక్కడ, మరి అక్కడ పాలకపక్షానికి సలహాలు యిస్తూ ఒక పెద్దమనిషి తీరుగా అసెంబ్లీలో ఎంతో వాకచక్యంగా వారు పని చెయడం మనం మరచిపోకూడదు. అటువంటి మహావ్యక్తి మనముందు లేరు.
10.10 ప. ఎప్పటిలాగానే రోజా కార్యక్రమాల కోసం ఆగష్టు 5న కూడా ఉదయాన్నే 7.30 లకు ప్రజా కార్యక్రమాలకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో స్నానం చేయడానికి బాత్‌రూంకు వెళ్లినవ్యక్తి ఎంతసేపటికి బయటకు రాకపోతే కుటుంబసభ్యులు కిటికీనుండి చూచి తలుపులు బద్దలుగొట్టి హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లేవరకు ఆయన చనిపోవడం జరిగింది. వారి మృతికి మాపార్టీ తరఫున తీవ్రసంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబసభ్యులకు మా సానుభూతిని తెలియజేస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ సిహెచ్. విఠల్‌రెడ్డి (నర్సాపూర్):- కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు గారు నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయడం జరిగింది. వారు భూస్వామ్య విధానం గురించి ఎన్నో పోరాటాలు చేశారు. పేదవారికి, భూమిలేనివారికి భూమి కావాలని పోరాటం చేశారు. వారు స్వాతంత్ర్య సమరయోధుడుగా జైలుశిక్ష అనుభవించడం జరిగింది. ఆయన చాలా నిరాడంబరుడు, నిజాయితీపరుడు, అసెంబ్లీలో సి.పి.ఎం. పక్ష నాయకుడుగా వుండి ఎన్నో ప్రజా సమస్యలు, పేదవారి సమస్యలు వచ్చినపుడు నిర్మొహమాటంగా మాట్లాడేవారు. నిర్మొహమాటంగా సలహా ఇచ్చేవారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారమే సభ నడపాలనే దృక్పథంతో వారు ఉండేవారు. వారు మరణించినందుకు మా కమ్యూనిస్టు పార్టీ వైపు నుండి తీవ్రమైన సంతాపం తెలుపుతూ, వారి కుటుంబానికి, వారి పార్టీకి మా సానుభూతిని తెలుపుతూ ముగిస్తున్నాను.

శ్రీ వి.రామయ్య (నిడుమోలు):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. వారు తీర్మానంలో చాలా వివరాలు తెలిపారు. అవి మళ్లీ రిపీట్ చేయడం నా ఉద్దేశ్యం కాదు. వారు ఎంతో గొప్ప నాయకుడుగా తయారయ్యారు. ఆయన 14వ ఏటనే తండ్రి చనిపోయిన తరువాత, కుటుంబ బాధ్యత నెత్తిమీద పడినప్పుడు పాలేరుగా జీవితాన్ని ప్రారంభించి, అప్పటినుండి ఇప్పటివరకు ఆయన జీవిత మజిలీలలో చాలా కష్టనష్టాలు ఎదుర్కొవలసి వచ్చింది. కమ్యూనిస్టు పార్టీ మట్టిలో మాణిక్యాలను సృష్టిస్తుంది అనే నానుడిని బోడేపూడి వారు రుజువు చేశారు. అట్టడుగు స్థాయి నుండి కూలీగా, పాలేరుగా జీవితం ప్రారంభించి

చదువుసంధ్యలు లేని పరిస్థితిలో కూడా బయట ఉపాధ్యాయుల వద్ద అక్షరాలు నేర్చుకొని ప్రైవేటుగా తాను కూడా ఉపాధ్యాయుడుగా పనిచేశారు. వారి ప్రవర్తన ద్వారా కమూనిస్టు పార్టీ ప్రతిష్ట పెరగడానికి కృషిచేశారు అనేది-నాకున్న అభిప్రాయం. చాలా సార్లు ఆయన జైళ్ల పాలయ్యారు. 1974లో రైల్వేసమ్మె జరిగినపుడు ఆయనను జైలులో పెట్టారు. ఎమర్జన్సీ పీరియడ్‌లో జైలులో పెట్టారు. అనేక సందర్భాలలో జైలుశిక్ష అనుభవించారు. నిజాం పరిపాలనకు నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఆయన జీవితం పోరాటాలమయం. ఇటువంటి పోరాటాలతో ఆయన నాయకుడుగా ఎంతో ఎదిగిపోయారు. ఇటువంటి నాయకుని కలిగివున్నందుకు కమ్యూనిస్టు పార్టీలో వున్న మాకంతా ఎంతో గర్వంగా ఉంది. ఇటువంటి సందర్భాలలో మనం చాలా విషయాలు గుర్తుపెట్టుకోవాలి. సభలోనూ, బయట కూడా ఆయన వాణి ప్రజలవాణిగా గణుతికెక్కింది. ముఖ్యమంత్రిగారు వారి గురించి చాలా విషయాలు చెప్పారు. అది వాస్తవం. శాసనసభలోనూ బయట కూడా ఆయన తన ప్రవర్తనలో చాలా క్రమశిక్షణను పెంచుకొన్నారు. అదే లేకపోతే వారు ఆవిధంగా ఎదగడం సాధ్యంకాదు. కమ్యూనిస్టు పార్టీలో వున్నప్పటికి వారికి భారతం తెలుసు, భాగవతం తెలుసు, గయోపాఖ్యనం తెలుసు. ఆయన సంగీతప్రియుడు. అనేక సందర్భాలలో ఆయన మాకు గయోపాఖ్యానం పద్యాలు పాడి వినిపించేవారు. ఎన్నో పురాణాలు గ్రంథాలు వారు ఆకలింపు చేసుకొన్నారు. వారికి డిగ్రీ లేకపోయినప్పటికీ గొప్ప మేధావి అని నాకున్న అభిప్రాయం. ఇప్పటి తరానికి వారు మార్గదర్శకులు. ఆయన జీవితాన్ని గమనిస్తే మనం అలవరచుకోవలసిన అలవాట్లు, దీక్ష, పట్టుదల, మార్గదర్శకత్వం ఇమిడివుందని నేను చెబుతున్నాను. కొన్ని సందర్భాలలో ఇక్కడగానీ, బయట గానీ పోరాడేప్పుడు క్రమశిక్షణకు కట్టుబడి వుండాలి. ఇక్కడ బయట గానీ ఎంత ఘర్షణ జరిగినా కూడా సమస్యను సామరస్యపూర్వకంగా చర్చించుకోవాలనే మనస్తత్వంతో వుండి ఆయన సలహా ఇచ్చినపుడు అందరూ దానిని గౌరవించేవారు ఆయన కూడా చాలా పెద్దమనిషిగా ప్రవర్తించేవారు. వారు అటువంటి గౌరవం తెచ్చుకొన్నారు. ఈ తరం ఆయన అలవాట్లు, క్రమశిక్షన, ఉద్దేశాలు, దీక్ష పట్టుదల ఆయన ఆశయాలను గుర్తుపెట్టుకోవలసిన మార్గదర్శకుడుగా ఆయన ఉన్నారు. నమ్మిన మార్క్సిజం సిద్ధాంతాల ద్వారా కష్టజీవుల జీవితాలలో విముక్తి రావాలని కోరారు. సోషలిజం ఈ దేశంలో రావాలని కోరుకొన్నారు. ఆ విధంగా జరిగినప్పుడు పేదవాడి జీవితం దోపిడీకి గురికాకుండా వుంటుంది. వారి కష్టజీవితాలు మెరుగుపడతాయని భావించారు. అటువంటి ఆశయాల కోసం జీవితం అంకితంచేసి, ఎన్నో కష్టనష్టాలు వచ్చినా ఎదుర్కొని, విప్లవకారుడిగా, మార్గదర్శకుడుగా వారు జీవితం గడిపారు. అటువంటి మార్గదర్శకుడు చనిపోవడం కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికే తీరనిలోటు. అది పూర్తిచేసుకోవలసిన అవసరం ఉందనేది దృష్టిలో పెట్టుకొని యువతరం ముందుకు పోవాలనేది నాకున్న అభిప్రాయం. నీటిప్రాజెక్టుకు పేరు పెట్టారు మంచిదే. స్థానికంగా జిల్లాలో మేము కూడా తిరిగి ఇందుకు సంబంధించిన సమస్యలు ముఖ్యమంత్రిగారి దృష్టికి తెస్తాము. ఈ తీర్మానం ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

సంతాప ప్రతిపాదన: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మృతిపట్ల.

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు (మెట్‌పల్లి):- అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారు మనమధ్య లేకపోవడం చాలా దురదృష్టకరమయిన విషయంగా భావిస్తున్నాను. వెంకటేశ్వర రావుగారికి సన్నిహితంగా శాసనసభలోనూ, బయట, అనేక కమిటీలలో వారితో ఉండే అవకాశం నాకు కలిగింది. వారి నిజజీవితంలో చాలా స్పష్టంగా మంచి ఉంటే మంచిఅని, చెడంటే పొరబాటుగా వారికి అనిపించినపుడు ఆ అంశాన్ని చాలా నిర్ధ్వందంగా ఖండించేవారు. సాధారణంగా వ్యక్తులు నెలల తరబడి, సంవత్సరాల తరబడి కలసి ఉండడం సాధ్యం కాదు. కానీ జైలులో ఖచ్చితంగా కలిసివుండే పరిస్థితి ఏర్పడుతుంది. దేశంలో అత్యవసరం పరిస్థితి విధించినపుడు వెంకటేశ్వరరావు గారితో కలసి జైలులో ఉండే అవకాశం ఒక సంవత్సరం పాటు నాకు కలిగింది. జైలులో వున్న ప్రతిరోజూ నన్ను చూస్తూనే భోజనం చేశావా అని, ఆరోగ్యం ఏవిధంగా ఉందనే అప్యాయంగా వారు అడిగేవారు. వారు చూపించిన అప్యాయత నా జీవితాంతం మర్చిపోలేను. సిద్ధాంతపరంగా వేరయినప్పటికీ రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పుననుసరించి రాష్ట్ర శాసనసభలో 15 సంవత్సరాలుగా, ఇప్పుడు వున్న రీతిగానే లెఫ్ట్‌లోనే వారికి సీట్లు కేటాయించే పరిస్థితి ఉంది. శాసనసభలో కూడా వెంకటేశ్వర రావుగారితో సన్నిహితంగా ఉండే భాగ్యం అందువలన నాకు దక్కింది. ఇతర అంశాల మీద కూడా మాట్లాడుకొనేవారం. సిద్ధాంతపరంగా చాలా అంతరం ఉన్నప్పటికీ నమ్మిన సిద్ధాంతాలు అమలుచేయడం కోసం, ప్రజాహిత కార్యక్రమాలు చేయడంకోసం ఆయన జీవితం అంకితం చేయడం జరిగింది. తుది శ్వాస ఒదిలేవరకూ ప్రజలకు సేవ చేయడంలోనే
10.20 ఉ. నిమగ్నమైన ఆయనను ఖచ్చితంగా ఒక కర్మయోగి అనవచ్చు. ముఖ్యమంత్రి గారు ఆయన పేరిట ఒక మంచి నీటి పథకాన్ని ప్రారంభిస్తున్నందుకు నేను ముఖ్యమంత్రిగారిని అభినందిస్తున్నాను. శ్రీ వెంకటేశ్వరరావు గారి మృతి పట్ల నేను హృదయపూర్వకమైన శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను.

شری محمد امان اللہ خان (چندرائن گٹہ) :- چیف منسٹر صاحب نے شری بی وینکٹیشور راؤ صاحب کے انتقال پر تعزیت قرارداد پیش کئے ہیں میں اور ہماری پارٹی اس قرارداد کی بھرپور تائید کرتی ہے ۔ بی وینکٹیشور راؤ صاحب ۱۹۸۵ء سے مارکس کمیونسٹ پارٹی کے ممبر اور فلور لیڈر کی حیثیت سے ہمارے ساتھ تھے ۔ وہ فلور لیڈر کی حیثیت سے ایک اپنا اچھا ریکارڈ رکھتے تھے ۔ جب کبھی بھی اسمبلی میں گڑبڑی پیدا ہوتی تھی اسکو اچھے انداز میں سلجھانے کی کوشش کرتے تھے ۔ بالخصوص جب کبھی بھی میرے ساتھ بات چیت کرتے تھے تو اردو زبان میں کرتے تھے ۔ ان کو اردو زبان سے بہت پیار و محبت تھی ۔ میں جب کبھی بھی اقلیتوں کے مسائل اس ایوان میں اٹھاتا تھا وہ میری بھرپور تائید کرتے تھے ۔ آج وہ ہم میں نہیں ہیں ۔ آندھرا پردیش ایک اچھے اسمبلی رکن کو کھو دیا ہے ۔ میں اور ہماری پارٹی ان کے سوگوار خاندان کے غم میں برابر کے شریک ہیں ۔ چیف منسٹر صاحب نے پانی اسکیم کو ان کے نام سے موسوم کرنے کے تعلق سے اعلان کئے ہیں میں اور ہماری پارٹی اسکی تائید کرتی ہے ۔

సంతాప ప్రతిపాదన. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మృతిపట్ల. 17 నవంబరు, 1997

శ్రీమతి ఎన్.లక్ష్మీపార్వతి (పాతపట్నం):- అధ్యక్షా, నిరాడంబరులు, నిగర్వి అయిన శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారు పోయిన శాసనసభ సమావేశాలలో అందరికి ఎక్కటి సలహాలనిచ్చి శాసనసభను సక్రమంగా నడిపించడానికి చాలా విచిత్రమైన పాత్రను పోషించి ఈ శాసనసభా సమావేశాలకు లేకుండా పోవడం అనేది ఎవరూ ఊహించని విషయం. జరిగిన దురదృష్టం యావదాంధ్ర రాష్ట్రానికే కాదు, కమ్యూనిస్టు పార్టీకే కాదు, ముఖ్యంగా శాసనసభకు తీరని లోటుగా భావిస్తూ, ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఎందుకంటే పేదరికం ఒక శాపమూ కాదు, పేదరికం ఒక పాపమూ కాదు. పోరాడేవారికి పేదరికం ఒక నికషోపలము అని చాటి చెప్పిన శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారి మృతి ఒక తీరని లోటు ప్రతి శాసన సభ్యుడూ, పోరాట పథంలో ప్రయాణించే ప్రతి ఒకరూ కూడా వారి జీవితం నుండి ఎంతో నేర్చుకోవలసిన అవసరం వుంది, వారి జీవితం అందరికీ ఆదర్శవంతమైనదని నేను భావిస్తున్నాను.

వారు ఒక తండ్రిగా నాకు అనేక సలహాలు చెప్పారు ఎందుకంటే మా కుటుంబం కూడా కమ్యూనిస్టు కుటుంబం అవడంవల్ల వారు స్వయంగా పిలిచి చెప్పడం జరిగింది. "మీ ఫాదర్ అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు, నాకు తెలుసు, వారు సుందరయ్యగారి శిష్యుడిగా చేసిన పోరాటాలు నాకు తెలుసు" అని అభినందించినపుడు నాకు చాలా సంతోషం కలిగింది ప్రజా సమస్యలకోసం, ఉద్యమాలకోసం పోరాటం సాగించిన ఉదాత్తులు వారు. సామాన్యమైన జీవితంనుండి అత్యున్నతమైన స్థాయివరకూ తన జీవితాన్ని ఒక అమూల్యమైన గ్రంథంగా మలచి, ఆ మార్గంలో పయనించేవారికి మార్గదర్శకులైనవారు శ్రీ వెంకటేశ్వరరావుగారు. నిముషానికి వేలాదిమంది పుట్టే ఈ జనాభాలో, కోట్లాది జనాభా పెరుగుతున్న ఈ పరిస్థితులలో ఎందరో పుడతారు, ఎందుకో తెలీయదు, కొందరే పుడతారు అందరికీ తెలిసేలా అని ఒక మహాకవి చెప్పినట్లుగా ఆయన జీవితాన్ని ఒక సందేశంగా అందించి శాశ్వతమైన విశ్రాంతికోసం తరలి పోయిన ఆ మహామనిషికి మా ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి మా ఎన్.టి.ఆర్. తెలుగుదేశం తరపున సానుభూతిని అందించాలని మీద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ ఆర్ చంద్రశేఖర్ రెడ్డి (వనపర్తి).- అధ్యక్షా, శ్రీ బోడేపూడి వేంకటేశ్వర రావుగారి మృతిపట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. సభలో ఎప్పుడైనా ఏదైనా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడినపుడు మేము ఆయన దగ్గరకు వెళ్ళి ఇటువంటి సిట్యువేషన్‌లో మీరు రియాక్ట్ కావాలని అడిగినపుడు చాలా సందర్భాలలో ఆయన రియాక్టయి శాసనసభలో అందరూ సంయమనం పాటించాలని, శాసనసభ సజావుగా సాగడానికి అనువయ్యే వ్యాఖ్యలు చేసిన సందర్భాలు చాలా వున్నాయి. అంత పెద్ద మనిషి, సమాజాన్ని చదివిన మనిషి ఈ శాసన సభలో లేకపోవడం చాలా బాధాకరమైన విషయం గత శాసనసభా సమావేశాలలో శాసనసభ్యుల క్రీడలు జరిగినపుడు

మేము ఎందరో శాసనసభ్యులను కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటారా అని అడిగాము కాని ఆయనను అడగలేదు, ఎందుకంటె అనారోగ్యంతో వున్నారు కదాని. ఆయనే నన్ను పిలిచి నేను కూడా పార్టిసిపేట్ చేస్తానని చెబితే నేను నమ్మలేదు. ఆయనే నేను పాడాలనుకుంటున్నానని చెప్పి రిహార్సల్స్‌కు కూడా వచ్చారు. చాలామంది శాసనసభ్యులు క్రీడలను చాలా ఈజీగా తీసుకుని, తక్కువ మంది సభ్యులు పాల్గొంటున్న సందర్భంలో, ఆయన ఆ ఏజ్‌లో కూడా అందరితో సమానంగా కలసి మెలసి వుండడం అనేది, it is a sort of goodwil gesture on his part. ఆ కార్యక్రమంలో ఆయనవేదిక మీదకు వస్తున్నపుడు, చాలా ఇబ్బందికరమైన పరిస్థితులలో వచ్చి పాటలు పాడిన తీరు కాని, శాసన సభ్యుల పట్ల ప్రదర్శించిన ప్రేమ కాని మేము మరచిపోలేము. ముఖ్యంగా యంగ్‌స్టర్స్ అందరూ కూడా ఆయన చూపిన మార్గంలో పయనించి ఆయన ఆదర్శాలను పాటించవలసిన అవసరం కూడా వుంది. ఆయనను పొగడడానికి నాకు వయసు సరిపోదు. But, still I have the highest regard for him. ఆయన' ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి.పురుషోత్తమరావు (సిర్‌పూర్):- అధ్యక్షా, కీర్తిశేషులు, పెద్దలు బోడేపూడి వెంకటేశ్వరరావుగారు గత శాసన సభా సమావేశాలలో మన మధ్య ఎంతో సాన్నిహిత్యంతో మెలగి ఈనాడు వారు లేకపోవడం ఆంధ్ర రాష్ట్రానికే తీరని లోటు. ముఖ్యంగా నేను ఒకటి, ఒకటిన్నర సంవత్సరాలపాటు ఫ్లోర్ లీడర్‌గా వున్నపుడు, వారితో కలసి పనిచేసినపుడు వారికి వున్న సింప్లిసిటీ, వారు పెద్దవారిని, చిన్నవారిని గౌరవించే పద్ధతి చూస్తే నాకనిపించేది ఇటువంటి వ్యక్తులు రాజకీయాలలో రాణిస్తారా, పదవులకు నెగ్గుతారా అని. ఆయన అంత నిరాడంబరుడు, నిగర్వి. ఎవరికోసం కేటాయించిన సీట్లలో వారే కూర్చోవాలనే వారు. ఇప్పటికి, ఈ సమాజంలోని రాజకీయ పరిస్థితులలో 10 నుండి 15 శాతం మంది అటువంటి వారు వుండడంవల్ల ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలుగుతున్నాము. అటువంటి వారి అడుగుజాడలలో నడవవలసిన పరిస్థితి వున్నది. వారి మృతి రాష్ట్రానికి తీరనిలోటు, పార్టీకి తీరని లోటు. ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబ సభ్యులకు అందరికీ మా ఇండిపెండెంట్స్ శాసనసభ్యులందరి తరఫున నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

*శ్రీ ఎన్.రఘురాం:- అధ్యక్షా, శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారి మృతిపట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తున్నాను. వెంకటేశ్వర రావుగారికన్నా నేను చాలా చిన్న వాడిని. మధిర, జగ్గయ్యపేట ప్రక్కప్రక్క నియోజక

*An asterisk before the name indicates confirmation by the Member.

వర్గాలు. చిన్నప్పటినుండి మేము వారి గురించి వింటూ వుండేవారం. అనేక సందర్భాలలో ఆయన ప్రజల పక్షాన నిలబడి అనేకమైన ఉద్యమాలు చేసినట్లుగా మేము వింటూ వుండేవాళ్లం. 1985 నుండి ఆయన మధిర నియోజక వర్గానికి, నేను జగ్గయ్యపేట నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాము. మా ఇద్దరి సమస్యలూ ఒకే రకంగా వుండేవి. గ్రామాలలో వాటర్ రాకపోవడం కాని, ఇంకా ఇతర సమస్యల గురించి కాని నేను ప్రత్యేకించి మధిర వెళ్లడం, అక్కడి గ్రామాలలో తిరగడం జరుగుతూ వుండేది. అలాగే ఆయన కూడా జగ్గయ్యపేట నియోజక వర్గంలో తిరిగేవారు. ఈ విధంగా మేము ఇద్దరమూ కలసిమెలసి పనిచేసిన కాలం గుర్తుకు వస్తోంది. 1985లో ఇద్దరమూ ఎం.ఎల్.ఎ.లుగా ఎన్నికైన తరువాత న్యూ ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్‌లో ఒకే బిల్డింగ్‌లో
10.30 వుండడం తటస్థించింది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో ఒకప్పుడు మేము ఇద్దరు,
ఉ. సభ్యులుగా ఉన్న సమయంలో గ్యాంటాక్ వెళ్లాము. 4సంవత్సరాల క్రితం సివియర్‌గా వారికి హార్ట్‌స్ట్రోక్ వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో మేమంతా ఆందోళన పడ్డాము. ఆ సందర్భంలో నా భార్య కూడా నా ప్రక్కనే ఉంది. ఆమె హాస్పిటల్‌కి తీసుకువెళ్లి సపర్యలు చేయడం జరిగింది. మా అదృష్టము కొలది తెలుగువారయిన తిరుపతికి చెందిన డాక్టర్ అక్కడ కనబడ్డారు. వారు చాలా శ్రద్ధవహించి చక్కగా ట్రీట్‌మెంట్ చేశారు. తెల్లవారుఝామున కలకత్తాకు తీసుకువచ్చి హైదరాబాదుకి విమానం ద్వారా తీసుకురావడం జరిగింది. ఇవి అన్ని నాకు గుర్తుకు వున్నాయి. ఇప్పుడు వారు మన మధ్యన లేకపోవడం చాలా విచారకరమయిన విషయం. మా ప్రాంతంలో నిజానికి చాలా లోటు ఏర్పడింది. ప్రజా సంబంధాల వ్యక్తి లేకపోవడంవల్ల అక్కడున్న ప్రజలు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రిగారు, నేటి పథకానికిగాను వారి పేరు పెట్టడం చాలా ముదావహమయిన విషయం. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు:- బోడేపూడి వెంకటేశ్వరరావుగారి అకాల మరణానికి ఈ రోజు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ముఖ్యంగా ఖమ్మం జిల్లారాజకీయాల్లో మా అందరికి పెద్దగా, అన్ని పార్టీలకు గురుతుల్యులుగా జిల్లా అభివృద్ధిపట్ల, ఆ కార్యక్రమాలపట్ల, ఏ సమస్య వచ్చినా పిలిచి చెప్పడం జరిగేది. ఈ రోజు ఆ విధంగా సలహా ఇచ్చే వ్యక్తి మన మధ్యన లేకపోవడం దురదృష్టకరం. ఆయన నిజంగా అనారోగ్య కారణాలతో ఇబ్బందికరంగా ఉన్నప్పుడు బ్రతికి బయటపడినారు మంచిగా ఆరోగ్యంగా ఉండి, అంతకు ముందు రోజే ముఖ్యమంత్రి పర్యటన జరిగినప్పుడు, పువ్వాడ నాగేశ్వరరావు, నేను, ఆయన కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నాము. తెల్లవారు జన్మభూమి కార్యక్రమంలో, నా నియోజకవర్గంలో చూడాలి. చాలా బాగా చేశాము, ముఖ్యమంత్రిగార్ని తప్పకుండా మాప్రాంతానికి తీసుకువెళ్లాలని పట్టుబట్టి ఫోన్ చేసి ఆ కార్యక్రమానికి ముఖ్యమంత్రిగారిని తీసుకువచ్చి చూపించారు. తెల్లవారు మొక్కలు నాటే కార్యక్రమం ఉంది. మీరు తప్పకుండా రావాలని వారితో అన్నారు. 'మధిర కాలేజీలో ఆ కార్యక్రమం పెట్టారు. నేను 'సత్తుపల్లి' నుండి బయలుదేరి

జ. 292-2

ఆ కార్యక్రమానికి వెళుతూ ఉంటే మార్గమధ్యలో ఈ వార్త తెలిసింది. ఏది ఏమయినప్పటికి ఆయన నడవడిక, ఆ పార్టీలో అట్టడుగు స్థాయి నుండి ఎదిగిన తీరు, జిల్లా రాజకీయాలలో ఎవరూ మరిచిపోలేని పరిస్థితి. ఆయన ఆలోచనలకు తగ్గట్టు ఆయన చెప్పిన కార్యక్రమాలను పూర్తి చేయడం కోసం వారు ముఖ్యమంత్రికి వినతి పత్రాలకు సంబంధించి అన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రిగారు అనడం ఆ విధంగానే ఎంచినేని పథకానికి ఆయన పేరు పెట్టడం జరిగింది. ఇందుకుగాను ముఖ్యమంత్రిని అభినందిస్తూ, బోడేపూడివారి కుటుంబానికి సంతాప సానుభూతితెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. బాపిరాజు (అత్తిలి):-- బోడేపూడి వెంకటేశ్వరరావుగారు మన మధ్యన లేరు అనే మాటకు అందరితోబాటు ఆ బాధను నేను పంచుకుంటున్నాను. ఆయన చాలా పెద్ద మనిషి. హుందాతనమయిన జీవితాన్ని గడిపిన మనిషి, వారు తమ ఆఖరి క్షణం వరకూ జీవిత ధ్యేయాన్ని నెరవేర్చుకున్న వ్యక్తి. ఆ మహానుభావుడు ఎప్పుడో నిజాం హాస్పిటల్‌లో ఇంతకుముందు నాగేశ్వరరావుగారు చెప్పినట్లు ఆరోగ్యం క్షీణించి మరణించారు. అప్పటి నుండి ఆయన విల్ పవర్‌తోనే జీవించారు. ఆ విధంగా డాక్టర్లు చెప్పారు. మేము చేయవలసిన వైద్యం మేము చేశాము, ఇంక సాధ్యం కాదు, ఆయన తన విల్‌పవర్‌తోనే నడవగలుగుతున్నారని చెప్పారు. శాసనసభలో కూర్చున్నప్పుడు కూడా నేను వారితో చెప్పాను మీ జీవితం నిజాం హాస్పిటల్‌లో ఉన్నప్పుడే అయిపోయింది. మీ విల్‌పవర్‌తో శాసనసభలో గడిపారు. ఎంతో హుందాగా ఆరోగ్యాన్ని మరచిపోయి చక్కగా అన్నిటిలో పార్టిసిపేట్ చేశారు. ఏదో అటెండెన్స్ కోసం వస్తారని అనుకున్నానుకాని ఇలా పార్టిసిపేట్ చేస్తారని అనుకోలేదని వారితో అంటే, ఇది నా ధర్మంఅని వారు చెప్పారు. ఆయన డ్యూటికి ఎంతో ప్రియారిటీ ఇస్తారు. నేను స్వయంగా ఆయన ప్రక్కన అనుభవించాను. ఆయన తన మనవడికి ఉద్యోగం కావాలని సొంత పని అడగడానికి ఎంతో సిగ్గుపడ్డారు, బాధ పడ్డారు. ఆత్మవంచన చేసుకొని బాధపడుతూ అడిగారు. వీలయితే చేయండని అన్నారు. నా మనవడు కంప్యూటర్ కోర్సు నేర్చుకున్నాడు. అవకాశం ఉంటే ఉద్యోగం ఇవ్వండని అన్నారు. ఎంతో జాగ్రత్తగా మాట్లాడి అపాయింట్‌మెంట్ ఫిక్సు చేసుకొన్న తరువాత, ఈ రోజు మా పార్టీ మీటింగ్ ఉంది, పార్టీ మీటింగ్‌కే ప్రియారిటీ ఇస్తాను అపాయింట్‌మెంట్‌ని క్యాన్సిల్ చేయండని అడిగారంటే వారికి పార్టీపట్ల ఎంత గౌరవాభిమానాలు ఉన్నాయో అర్థమవుతుంది. తన సొంత పనిని పార్టీ కోసం మానివేస్తారు. ఆ తరువాత ముఖ్యమంత్రిగారు స్వయంగా ఫోన్‌చేసి తన నియోజకవర్గంలో జన్మభూమి కార్యక్రమం ఉంది, అందులో పాల్గొనమన్నందున వెంటనే వెళ్ళిపోవాలని ఇంకోసారి కలుస్తానని అంటే, ఫరవాలేదు, వెంటనే తీసుకురండని అంటే తీసుకువచ్చి పరిచయం చేసిన తరువాత మీకు కష్టమయిన పని చేయవద్దు, మా వాడు ఆ లైన్‌లో ఉన్నాడు, సహకరిస్తే సంతోషిస్తానని అంటే అక్కడున్న మేనేజింగ్ డైరెక్టర్ మీరు ఉదారంగా అడిగారు కాబట్టి ఏ విధంగా అయినా తీసుకుంటామని, పరీక్ష పెడతాము,

పాస్ కాకపోతే ఐదుసార్లయినా పరీక్షపెట్టి తీసుకుంటాము. సహకరిస్తామని వారు అన్నారు. ఆ విశ్వాసంతోనే వారు అడుగు వెనుక అడుగువేస్తూ జాగ్రత్తగా ఆ అసెంబ్లీ నుండి దిగుతూ వెళ్లడం నేను కళ్లారా చూసాను. అదే సెండాఫ్, ఆ తరువాత వారు మరణించడం జరిగింది. ఏ పని గురించయినా వారు ఎంతో ఆత్మ పరిశీలన చేసుకునేవారని చెప్పాను. ఇంకొకసారి జరిగిన అనుభవాన్ని చెబుతాను. పార్టీ ఫండ్ గురించి డబ్బు ఇచ్చిన వ్యక్తి నాకు తటస్థపడి చెప్పారు. ఒక సంవత్సరం క్రితం ఆయన పార్టీ ఫండ్ అడగకుండానే ఇచ్చారు. సంవత్సరం తరువాత ఆకస్మాత్తుగా ఒక కార్యక్రమంలో ఆ పార్టీ ఫండ్ ఇచ్చిన వ్యక్తి కనబడడంతో జేబులోంచి డైరీ తెరచి అందులోంచి రసీదు తీసి అతనికి ఇచ్చారట. ఇటువంటి లక్షణాలున్న వ్యక్తి వారు. వారు అకాలమరణం పొందారని అనను. సంపూర్ణంగా వారు జీవించారు. ఆదర్శవంతమయిన జీవితం గడిపారు. అందరూ వారి ఆదర్శాన్ని స్వీకరించవలసిన అవసరం ఉంది. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, బోడేపూడివారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ, ఇటువంటి మహానుభావుడి గురించి మనం ప్రత్యేకంగా ఈ శాసనసభలో మాట్లాడడం అదృష్టంగా భావిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ.మాధవరెడ్డి:- స్వర్గీయ బోడేపూడి వెంకటేశ్వరరావుగారి మృతిపట్ల ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. వారు గత 12, 13 సంవత్సరాలుగా శాసనసభలో ఆరోగ్యం బాగా ఉన్నా, లేకున్నా ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ సమావేశాలలో పాల్గొనడం, ప్రభుత్వానికి అమూల్యమయిన సలహాలు, అభిప్రాయాలను చెప్పడం జరిగింది. గత శాసనసభ సమావేశాల్లో ఆరోగ్యం బాగా లేనప్పటికీ వారు వచ్చారు. బోడేపూడివారు మీరు విశ్రాంతి తీసుకోవాలని చెప్పినా, నేను తప్పకుండా పాల్గొనాలని ఉదయమే వచ్చి పాల్గొనేవారు. ఈ రోజు శాసనసభలో వారు లేకపోవడం మన శాసనసభకే తీరని లోటు అని మనవిచేస్తున్నాను. ఖమ్మం జిల్లాలో
10·40 ఉ. 14 సంవత్సరాల వయస్సులో పాలేరుగా పని ప్రారంభించి, కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొని భూస్వాములకు, పెత్తందార్లకు, నైజాం నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి ఆయన. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకి వెళ్లి కార్మిక, కర్షకులకు ఎంతో సేవ చేసిన మహామనిషి నేడు మన మధ్యన లేకపోవడం అన్నది మనకే, రాష్ట్ర ప్రజలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ప్రజలకు చేయతలపెట్టిన మంచి పనులను మంత్రుల దగ్గరకు తానే స్వయంగా వచ్చి రిప్రజెంట్స్ చేసి వివరించి ప్రజలకు న్యాయం జరిగేలా ఆయన చూసేవారు. అటువంటి పెద్దలు ఈ రోజు లేకపోవడం చాలా దురదృష్టకరం. వారి యొక్క సిద్ధాంతాల, ఆశయాల కోసం మనమందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మరణం పట్ల సానుభూతిని తెలియజేసున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నాను.

17 నవంబరు, 1997. సంతాప ప్రతిపాదన: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మృతిపట్ల.

శ్రీ పి.నాగేశ్వరరావు (ఖమ్మం):- అధ్యక్షా, కష్టజీవుల పక్షపాతి, సుమారు అయిదు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో తన చరిత్రాత్మక బాధ్యత నిర్వహించిన శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు మనందరకూ దూరం కావడం వల్ల ముఖ్యమంత్రి గారు ఏదైతే సంతాపతీర్మానం పెట్టారో దానిని మేము బలపరుస్తున్నాము. రాష్ట్ర శాసనసభకు వరుసగా మూడుపర్యాయాలు గెలిచి ప్రజానాయకుడుగా ఎదిగి ప్రజల సమస్యలను ప్రతిబింబింప చేసిన ఒక మహానాయకుడు నేడు మన మధ్య లేకపోవడం తీరని లోటు అని తెలియజేస్తున్నాను. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారి అంతిమ యాత్రలో మన మందరం పాల్గొన్నాము. అన్ని పార్టీల వారం పాల్గొన్నాము. చాలా మంది నాయకులు చనిపోయినప్పుడు అంతిమ యాత్రలో పాల్గొనడానికి అందరూ వస్తారు. కానీ ఆనాడు ఖమ్మం పట్టణం మొత్తం ముఖ్యంగా కష్టజీవులు కడసారి తమ నాయకుణ్ణి చూడాలని వచ్చిన ఘటన మరువలేనిది. పేదవారు, రైతులు, ఆడవారు అన్ని వర్గాల వారు ఆ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారు చనిపోయే ముందు రాత్రి ఆయనతో నేను ఫోన్‌లో మాట్లాడాను. ఆయన ఆరోగ్యం బాగా లేకపోయినా సమస్యల ఎడల తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించిన వ్యక్తి ఆయన. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయనతోబాటు నేనూ కలసి పాల్గొన్నాను. జిల్లాలలో తిరిగి 33 ఏండ్లు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఈ సభలో ప్రక్క ప్రక్కన కూర్చొని కోఆర్డినేషన్ చేసుకోవలసి వచ్చేది. సి.పి.ఐ. సెక్రటరీగా నేను 10 సంవత్సరాలు, ఆయన సి.పి.ఎం.సెక్రెటరీగా 10 సంవత్సరాలు పని చేశాము. ఒకే జిల్లాలో ఉండి భిన్నమైన పార్టీలకు పనిచేస్తూ ఎంతో సామరస్యంగా ప్రజల సమస్యల ఎడల కలసి పనిచేయడానికి మాకు ఎటువంటి అడ్డంకులు రాలేదు. ఎన్నికల సమయంలో ఆయనపై బాధ్యత పెట్టినప్పుడు ఆయన తన వయస్సుని కూడా లెక్క చేయకుండా బాధ్యతలను నిర్వర్తించారు. రాయలసీమలో తిరిగిన నియోజకవర్గం తిరుగకుండా రాత్రింబవళ్లు తిరిగి కలిసి పనిచేశాము. ప్రజా సమస్యలపైన జాయింట్‌గా మేము ప్రచారం చేశాము. దీర్ఘకాలికి అనుభవం ఉండి అత్యంత అనుభవం వున్న ఆప్తమిత్రుడిని నేను కోల్పోయాను. నిజ జీవితంలో అందరం ఎప్పుడో ఒకసారి చనిపోవాల్సినదే. చరిత్ర సృష్టించుకొన్న వారిని మరీ జ్ఞాపకము తెచ్చుకొంటాము. మన మిత్రుడు శ్రీ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పినట్లు ఆయనపై వయస్సు మీద పడ్డా కల్చరల్ యాక్టివిటీస్‌లో తప్పక పాల్గొనేవారు. ఆయన అండర్‌గ్రౌండ్‌లో ఉన్నప్పుడు తెనాలి, మద్రాసులలో సినిమా ఫీల్డులకు దగ్గరగా ఉన్నారు. ఆయన సంస్కృతము, భారత, బాగవత గ్రంధాలను కూడా చదివేవారు. భగవద్గీతలోని పద్యాలు పాడెవారు. హరిశ్చంద్రనాటకములోని పద్యాలు కూడా చక్కగా ఆలాపించేవారు. ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్‌ని కూడబలుక్కొని చదివి దాని అర్థం నన్నడిగి తెలుసుకొనేవాడు. ఈ సభలో కూడా అప్పుడప్పుడు కూడబలుక్కొని చదివిన ఘటనలు మీకు తెలుసు. జీవితంలో ఏదో నేర్చుకొందామనే తపన కల్గినవారు ఆయన. ముఖ్యంగా కొంత మంది నాయకులకు కొన్ని పేర్లు పెడుతూ ఉంటారు. మా రాజేశ్వరరావు గార్కి కూడా పెట్టారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ లీడర్ లేజెండరీ ఫిగర్. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు విషయానికి వస్తే ఆయన రైతు నాయకుడు. అందుకని ఆయన "ఆంధ్రప్రదేశ్ రైతు సంఘానికి" అధ్యక్షుడిగా ఉన్నారు. పేద రైతు వర్గాలను ఆదుకొన్నారు. అత్యంత బాధాకరమైన

పరిస్థితిలో ఈ తీర్మానాన్ని మూవ్ చేయవలసి వచ్చింది. శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు చెప్పినట్లు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారు చాలా బాగా తిరుగుతున్నప్పుడు చనిపోయారు. ఆరోగ్యం బాగా లేనప్పుడు చనిపోతాడని అనుకొన్నాము. కానీ అలా జరుగలేదు. జన్మభూమి కార్యక్రమంలో ఒకటి, రెండు, మూడవ తేదీలలో ఆయనతో మేము కలిసి ఉన్నాము. నాల్గవ తేదీన పిడుగుపాటు లాంటి వార్త విని ఇటువంటి తీర్మానము ప్రవేశపెట్టాల్సి వచ్చినందుకు బాధ కల్గుతోంది.. తన నియోజక వర్గంలో ఫ్లోరైడ్ నీరు ఉండడం వల్ల మంచినీటికి ఇబ్బంది కల్గుతోందని అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువచ్చి తనకు ఏర్పడ్డ కాళ్ళ వంకరని కూడా చూపేవారు. ఖమ్మం జిల్లాలో కేంద్ర ప్రభుత్వం 25 కోట్ల రూపాయలతో ఒక పథకాన్ని తయారు చేసి ఆయన నియోజక వర్గానికి మంజూరు చేసింది. దానికి (ఆ పథకానికి) ముఖ్యమంత్రి గారు ఆయన పేరు పెట్టడం న్యాయసమ్మతమైనది. దీనిని హృదయ పూర్వకముగా బలపరుస్తున్నాను. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గార్కి నలుగురు ఆడపిల్లలు ఒక మగపిల్లవాడు ఉన్నారు. వారంతా నాకు బాగా తెలుసు. వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు అడుగుజాడలలో కష్టజీవులకు మేలు చేసే ఆయన చారిత్రాత్మక బాధ్యతను నెరవేర్చడంలో మనం కృతకృత్యులం కావాలని తెలియజేస్తూ ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

10.50 ఉ. | శ్రీ ఎన్. రాఘవరెడ్డి (నకిరేకల్):- అధ్యక్షా, మొన్నటి సమావేశానికి వచ్చిన వారు ఈ సమావేశానికి లేకపోవడం నిజంగా చాలా బాధకరమైన విషయం. మేము ఇద్దరం చాలా కాలం కలసి పనిచేశాము. ఆయన క్రమశిక్షణ కలిగిన సైనికునిగా ప్రతి విషయంలోనూ పనిచేసే వారు. వారు చిన్నతనం నుంచి కూడా అంటే 1939 సంవత్సరం నుంచే రాజకీయోద్యమంలో, సత్యాగ్రహాలలో పనిచేశారు. ఆంధ్ర మహాసభలో పనిచేశారు. 1942లో ఆంధ్ర మహాసభ విడిపోయినప్పుడు కాంగ్రెసు మహాసభ మడికొండ, వరంగల్ జిల్లాలో జరపాలని నిర్ణయించడం జరిగినప్పుడు వరంగల్ మహాసభకు మధిర నుంచి వేలాది మంది జనులను తీసుకు వచ్చి సభను జయప్రదం చేసిన యువకుడాయన. ఆయన పట్టుదల గల నాయకుడు. ఆయన నేను రెండు సందర్భాలలో 3 సంవత్సరాలపాటు జైలు జీవితం గడపవలసి వచ్చిన సందర్భంలో ఆయనలో వున్న పొదుపరితనం, క్రమశిక్షణాయుత జీవితాలను నేను గమనించడం జరిగింది. ఆ సందర్భంలో నేను వంటచేయడంలోనూ, ఆయన సరుకులు తేవడంలోనూ నియుక్తులమవడం జరిగింది. ఆ సందర్భంలో వంటచేయడంలో ఏదైనా కొంత ఎక్కువ తక్కువలు జరిగినట్లయితే ఆయనచేత మందలించబడిన సందర్భాలు వున్నాయి. ఆయన మాతో ఎంతో సన్నిహితంగా సామరస్య పూర్వకంగామండేవారు. ఆయనరైతు సమస్యలను పరిష్కరించేందుకుగాను రైతులను, రైతుకూలీలను అందరినీ సమీకరించి కార్యక్రమాల నిర్వహణ చేసి, సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రయత్నించేవారు. అందుకుగాను తమ సాయశక్తులా కృషిచేసేవారు. ఒక్కోసారి శాసనసభా సమావేశాలలో సాయంత్రాలప్పుడు నాకు కాళ్ళ నొప్పులుగా వున్నాయని నేను అంటునప్పటికీ ఆయన ఎంతో సౌమనస్యంతో సమావేశాలలో పాల్గొనక తప్పదనీ, కావాలంటే నన్ను విశ్రాంతి

తీసుకోమని చెప్పిన సందర్భాలున్నాయి. అల్లరి చేసి సభను దారిమళ్లించేపద్ధతికాదు. ఆయన పద్ధతి సామరస్య పూర్వకంగా సమస్యల పరిష్కరించుకోవడమే. ఆయన క్రమశిక్షణ, పట్టుదలకలిగిన నాయకుడు. వారు లేని లోటు పార్టీకి తీరని లోటు. వారి మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాను. వారి ఆత్మకు శాంతికలుగాలని కోరుతున్నాను. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రిగారి తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాదె వెంకటరెడ్డి (పర్చూరు):- అధ్యక్షా, పెద్దలు, కీర్తిశేషులు శ్రీబోడేపూడి వెంకటేశ్వరరావుగారి మరణం అందరినీ విషాదంలో ముంచిందన్నది మనం చెప్పక తప్పదు. ఆయనలో చాలా గొప్పగుణం వున్నది. అది పేదరైతుల పట్ల ఆప్యాయతా, ఆదరాలు. వారితో నాకు కొద్ది కాలంగానే పరిచయం వున్నప్పటికీ, ఆయన 'ఏ మాన్ ఆఫ్ కల్చర్. ఆయన పెద్దవారిపట్ల, చిన్నవారిపట్ల, పేదలు, భాగ్యవంతులు అందరిపట్ల ఒకే విధమైన ఆదరాభిమానాలను కలిగి వుండేవారు. అందరినీ ఒకే తీరుగా పలకరించే వారు. మనం ఆయన జీవితం నుంచి నేర్చుకోవలసిన విషయం అదే. ఆయన ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన అతి చిన్న రైతు కుటుంబంలో జన్మించినవారైనప్పటికీ కమ్యూనిస్టు పార్టీలో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. అదే వారిలోని ప్రత్యేకతని నేను చెప్పకతప్పదు. నిజానికి కమ్యూనిస్టు పార్టీలో సీనియర్ వ్యక్తులకు చాలా విలువ యిస్తారు. అందుకు అభినందించక తప్పదు. వారిలో డిసిప్లిన్‌కు ఎక్కువ ప్రాధాన్యత వుంది పద్ధతి ప్రకారం డిసిప్లిన్ మేరకు ఆ పార్టీలో వారు అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. ఆయన పార్టీలో సీనియర్ మెంబరేకాక, పార్టీకి తమ జీవితాన్ని డెడికేట్ చేసిన వ్యక్తి. వారు మిత్ర పక్షంలో వున్నప్పటికీ, సమస్యలపట్ల సౌమనస్యంగా ప్రవర్తించేవారు. ప్రయివటైజేషన్ పట్ల కార్మికులను కలిగే కష్టాలను గమనించి, వారికి న్యాయం చేసేందుకుగాను సాయశక్తులా పాటుపడిన వ్యక్తి. ఆయన మిత్రపక్షానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ ధైర్యంగా, సాహసవంతంగా సమస్యల పట్ల స్పందించిన వ్యక్తి... though he was a leader of Communist party, he was a man of culture. He was a sincere and dedicated worker. He was a tireless fighter. He was a man of masses. ఆయన పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు, సామాన్య కార్యకర్తలకు, మాస్‌కు కూడా లీడర్‌గా వ్యవహరించబడేవారు. ఆయన 1985, 1989, 1994లలో మధిర నియోజక వర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆయన వద్దకు అశేష ప్రజలు వచ్చేవారు. ఉదాహరణకు, పేద బలహీన వర్గాల వారు, చిన్నవాళ్లు, రైతులు, రైతుకూలీలు అందరూ వచ్చేవారు. వారందరి సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేసేవారు. అనారోగ్యంగా వున్నప్పటికీ ఆయన శాసన సభా కార్యక్రమాలకు తప్పకుండా హాజరయ్యేవారు. ఒకప్పుడు స్పాండిలైటిస్‌తో బాధపడుతున్నప్పుడు నిజాము హాస్పటల్‌లో చేరవలసి వచ్చింది. అక్కడ వారు కూడా వున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు బహు తాపత్రయపడ్డారు. నాడు కొన్ని

ఫ్యాక్టరీల ప్రైవేటైజేషన్ గూర్చి సమస్య శాసనసభలో మాట్లాడవలసిన పరిస్థితులు వచ్చాయి. ఆ పరిస్థితులను ఎదుర్కొవేందుకు, కార్మికులకు అన్యాయం జరగకుండా చూసేందుకు సభలో మాట్లాడిన వ్యక్తి ఆయన. వారి జీవితం నుంచి మనం ఎంతో నేర్చుకోవలసి వుంది. వారి జీవిత చరిత్ర గూర్చి ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానం నేను పూర్తిగా బలపరుస్తున్నాను. వారు లేని లోటు ఆ పార్టీకి తీరనిలోటు. His death is a loss to the Kisan movement. వారు తాము నమ్మిన ఆశయాల సాధనకు పట్టుదలతో పాటుపడేవారు. ఆశయాలకు సంబంధించి పోరాటం సాగించి సాధించుకునేవారు. వారి మృతి పట్ల విచారాన్ని తెలుపుతూ, వారి ఆత్మకు శాంతికలగాలని కోరుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎన్.యతిరాజారావు (చెన్నూర్):- అధ్యక్షా, 75 సంవత్సరాల వయస్సుగల పెద్దలు శ్రీ బోడేపూడి వేంకటేశ్వరరావుగారి మరణం పట్ల నా హృదయపూర్వక విచారాన్ని తెలియజేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. ఆయన మరణం, ఈరాష్ట్రానికి, ఈ శాసనసభకు, ముఖ్యంగా ఖమ్మం జిల్లాకు తీరని లోటు.1948లో మేము బార్డర్ క్యాంపస్‌లో వున్నప్పుడు, ముడిపల్లి, అలీపురం, మధిర నియోజకవర్గాలకు చెందిన గ్రామాలలో దగ్ధం జరిగినప్పుడు భారత ప్రభుత్వ ఏజెంటుగా ప్రెసిడెంట్ శ్రీ కె.మున్షీగారు అక్కడకు వస్తున్న సందర్భంలో వారికి ఫోటోలు యివ్వడానికి నేను వాలంటీరుగా ఆ గ్రామానికి వెళ్లడం జరిగింది. అక్కడ శ్రీ బోడేపూడి వేంకటేశ్వరరావుగారు వున్నారు. అప్పుడు వారి వయస్సు 18 సంవత్సరాలు. ఆ సందర్భంలో నాకు శ్రీ బోడేపూడి వారితో పరిచయం కలిగిందని మనవి చేస్తున్నాను. ఇక్కడ శాసనసభలో ఉన్నప్పుడే కాదు ఎన్నో రోజుల నుంచి పరిచయం ఉన్నది. లెఫ్ట్, రైటు అని రెండు భాగాలుగా విడిపోయిన తరువాత కూడా వారు ఎంతో అద్వితీయమైన పాత్ర ఈ యొక్క పార్టీలో నిర్వహించారని మనవిచేస్తున్నాను. ఉభయ కమ్యూనిష్టు పార్టీలు కలసి ఉన్నప్పుడు కూడా వారు ఖమ్మం జిల్లాకు నాయకత్వం వహించారు నేను ఎప్పుడైనా కలిస్తే నా ఆరోగ్యం గురించి వారు, వారి ఆరోగ్యం గురించి నేను అడగడం జరిగింది. వారు రోజు అసెంబ్లీలో కలిసినా వస్తున్నాపోతున్నా, కూర్చొన్నప్పుడు కూడా ఆరోగ్యాల గురించి మాట్లాడుకొనేవాళ్లం. 1989లో మేము ప్రతిపక్షంలో ఉన్నాము. నా సీటు నాగేశ్వరరావు ప్రక్కనో లేకపోతే సుబ్బరాజుగారు లేకపోతే రాజిరెడ్డిగారి సీటు ముందో ఉండేది. ఏదన్న విషయం ఉన్నట్లయితే వారితో మాట్లాడుతూ ఉండే వాడిని. నాగేశ్వరరావుగారి ప్రక్కనే వెంకటేశ్వరరావుగారు ఆ ప్రక్కనే టి.డి.పి. వాళ్లం కూర్చొనే వాళ్లం. రజబలిగారు బ్రతికి ఉన్నప్పుడు పార్లమెంటు ఎన్నికలు రాబోతున్న సందర్భంలో ఉభయ కమ్యూనిష్టు పార్టీలు కలసి పోటీ చేసినా తాను గెలిచి తీరుతానని వెంగళరావుగారు అన్నారట ఏమిటి అన్నప్పుడు, శ్రీబోడేపూడి వెంకటేశ్వరరావుని నిలబెడితే ఆ సీటు తప్పనిసరిగా పార్టీకి

వస్తుందని శ్రీ రజబలిగారు చెప్పడం జరిగింది. ఇప్పుడు ఇద్దరు లేరు. వారు లేరు వీరు లేరు ఆనాటి విషయం మనవిచేస్తున్నాను ముఖ్యమంత్రిగారి ఛాంబరులో శ్రీ వంకా సత్యనారాయణగారని కలసినప్పుడు స్వాతంత్ర్యానికి ముందు ఎన్నికైన శాసనసభ్యులు శ్రీ సిహెచ్.రాజేశ్వరరావు, శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు శ్రీ ఎన్.రాఘవరెడ్డి, నేను, మిగిలాము ముఖ్యమంత్రిగారికి సన్మానం చేయమని మీరైనా చెప్పమని చెప్పడం జరిగింది ఇవి అన్నీ కూడా మాకు జ్ఞాపకం వస్తున్నాయి. ఈ రోజు ఐదుగురు పోయి నలుగురం అయినాము. మొత్తంమీద బాధతో చెబుతున్నాను. వారు చాలా సౌమ్య హృదయులు మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదైనా తొందరపడితే న్యాయం కాదు, సరైనది కాదు అని శ్రీ ఎన్ టి.రామారావుగారికి, శ్రీ చంద్రబాబునాయుడు గారికి కూడా చెప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటి నాయకుడిని పోగొట్టుకోవడం రాష్ట్ర అసెంబ్లీలో తీరని లోటు. రాష్ట్రానికి, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి చాలా లోటు అని చెప్పి మనవిచేస్తున్నాను. వారి కుటుంబానికి నాయొక్క ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎన్.స్వామిదాస్ (తిరువూరు):- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తూ కీర్తిశేషులు బోడేపూడి వెంకటేశ్వరరావు గారి మరణం యావత్తు రాష్ట్రానికి తీరని లోటు అని తెలియచేస్తున్నాను. మధిర నియోజక వర్గం, తిరువూరు నియోజక వర్గం ప్రక్కనే ఉండడం విద్యార్థి దశ నుండి మధిర ప్రాంతాలలో చదవడం, ఖమ్మం కళాశాలలో విద్యార్థిగా ఉండడం, వామపక్ష ఉద్యమాలతో సంబంధం ఉండడం వలన శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారిని నేను చిన్నతనం నుంచి బాగా ఎరుగుదును. వారు నీతినిజాయితీగా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీ పడకుండా జీవించినంత కాలం ప్రజల కోసం ప్రజల మధ్య జీవించినటువంటి విధానం ఒక్క కమ్యూనిస్టులకే కాదు ప్రతి పౌరునికి కూడా ఆదర్శవంతమైనటువంటి వ్యక్తి. ఆయన చూపించినటువంటి విలువలను ఆదర్శవంతగా తీసుకోవాలని కోరుతున్నాను. వారు ఎంతో ఓర్పుతో ఏ సమస్యనైనా ట్యాకిల్ చేసేవారు. నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ టెయిలెండ్ భూముల్లో ఉన్నటువంటి రైతులకు నీరు అవసరం వచ్చినప్పుడు పంటలు ఎండిపోతున్నప్పుడు వయస్సు పర్మిట్ చేయకున్నా కాలువ గట్ల మీద అధికారులు మానిటర్ చేయడం లేదని చెప్పి చాలా ఓర్పుతో ప్రయాణం చేసేవారు. రైతుల కోసం, పేదల కోసం అహర్నిశలు ఆయన ఒక బృహత్తరమైనటువంటి మహత్తరమైనటువంటి పోరాటం జరిపి చివరివరకు పోరాడే వారు. మా మొత్తం రెండు నియోజకవర్గాలలో భౌగోళికంగా ఒకే విధమైనటువంటి సమస్యలు ఉండేవి. వారు స్పందించినటువంటి సమస్యల మీద మా ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా తీరని లోటు. వారికి మా నివాళులు అర్పించడం ఏమిటంటే వారు ఎదైతే సమస్యల మీద పోరాడారో వాటిని పూర్తిగా సాధించేంతవరకు ఆయనను ఆదర్శవంతంగా తీసుకొని ప్రయాణం చేయడం వారికి సరైన నివాళి అని చెప్పి మనవిచేస్తున్నాను. వారి కుటుంబానికి, వారి పార్టీకి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

*శ్రీ ఎం.కోదండరెడ్డి (ముషీరాబాద్):- శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారి మరణానికి సంతాపం తెలియచేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానానికి మాపార్టీ పక్షాన సంపూర్ణంగా మద్దతు తెలియచేస్తున్నాను. పెద్దలు అనేక విషయాలు, వారి జీవితం గురించి, వారి సేవల గురించి శాసనసభలో కాని బయట కాని ఆ పార్టీకి చేసిన సేవలు గురించి చెప్పారు. వాటి జోలికి పోకుండా నాకు కమ్యూనిష్టు పార్టీ అంటే, సిద్ధాంతాలు అంటే చాలా మక్కువ, గౌరవం. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారు ఈ శాసనసభ్యుడిగా, మార్క్సిష్టు పార్టీ శాసనసభ పక్ష నాయకుడిగా శాసనసభలో ఎన్నో సమస్యలు, కీలకమైన సమస్యలు, ప్రస్తావించేవారు. ప్రధానంగా రైతుల సమస్యలు, కార్మికుల సమస్యలు, కార్మాగారాల సమస్యలు, పేదవారి సమస్యలు వచ్చినప్పుడు వాటి పరిష్కారానికి తను సూచనలు చేస్తూ ఈ రాష్ట్రానికి ఎంతో సేవ చేశారు. అధ్యక్షా,
11.10 ఉ. శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారితో నాకు రెండు, మూడు సంఘటనలు మరచిపోలేనివి ఉన్నాయి. ఈ రాష్ట్రంలో పెనుతుఫాను వచ్చినప్పుడు నేను, జనార్ధనరెడ్డి గారు, గాదె వెంకటరెడ్డి గారు తుఫాను దెబ్బతిన్న ప్రాంతాలకు పోయాము. ప్రకాశం జిల్లాలోని రాళ్ళపాడు, మోపాడు ప్రాంతాలలో మేము పర్యటిస్తున్నప్పుడు ఆయన కూడా అక్కడకు రావటం జరిగింది. ఆయన అంత వయసులో ఉన్నప్పటికీ గుట్టలు, చెట్లు దాటుకుంటూ ఆ తెగిపోయిన చెరువు వద్దకు పోయి చూడటం, బాధితులను పరామర్శించటం జరిగింది. ఆ సందర్భంగా బాధితులతో ఫోటోలు కూడా దిగటం జరిగింది. ఆ సంఘటనలను నేను ఎన్నడూ మరవలేము. ఆయన అనారోగ్యంగా ఉన్నప్పటికీ, పార్టీ ఆదేశాల మేరకు తుఫాను దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించారు. అనారోగ్యంగా ఉన్నప్పటికి ఎందుకు వచ్చారని నేను అడిగితే ప్రత్యక్షంగా చూసి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తేగాని సమస్యలు తీరవని వారు పేర్కొన్నారు. ఎమినిటీస్ కమిటీలో కూడా ఈ శాసనసభ్యుల సమస్యలు. మాజీ శాసనసభ్యుల పెన్షన్ సమస్యలు. బస్‌పాస్ విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించే విషయం చాలా చక్కగా పరిశీలించి తన బాధ్యతలను నిర్వర్తించేవారు. శాసనసభ్యులకు కంప్యూటర్స్ ఇచ్చే విషయం అశోక గజపతిరాజు గారు అడిగితే ఆయన మాట్లాడుతూ ఆ వెచ్చించే మొత్తాన్ని ఏదైనా ఒకదానికి సబ్సిడి క్రింద ఇచ్చినట్లయితే ప్రజాసమస్యలు కొన్ని పరిష్కారమవుతాయని అన్నారు. ఆ తపన ఆయనకు ఉంది. ఏ బాధ్యత ఆయనకు అప్పగించినా చాలా చక్కగా, పెద్ద మనిషిగా నిర్వర్తించేవారు. అటువంటి నాయకుడు ఈ రోజు మన మధ్యలో లేకపోవటం విచారకరం. వారికి మా పార్టీ తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

శ్రీ సిహెచ్. రాజేశ్వరరావు (సిరిసిల్ల):- అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావుగారి మరణం పట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని గౌరవసభ్యులు వివరముగా పేర్కొన్న విషయాలన్నింటిని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. వారు నాకు చిరకాల మిత్రులు, దాదాపుగా అర్ధశతాబ్దం నుండి సహచరులు, అత్యంత కఠినమైన పోరాట పటిమ కలవారు. ఆయనతో కలసి పనిచేసే సదవకాశం నాకు లభించింది. ఆయన గుణగణాల గురించి అందరూ చెప్పారు. ఆయనకున్న అత్యంత ప్రధానమైన సుగుణాలు వినమ్రత, నిరాడంబరం, పేద ప్రజలపట్ల

*An asterisk before the name indicates confirmation by the Member.

పక్షపాత వైఖరి మరియు క్రమశిక్షణ. ఆయన పేదవాడుగా పుట్టాడు కాబట్టి ఆ నిరాడంబరత, పేదలపట్ల పక్షపాత వైఖరి వచ్చి ఉండవచ్చు. అయితే వినమ్రత విశిష్టమైన క్రమశిక్షణలు ఆయన స్వయంగా సంపాదించుకున్న గుణగణాలు. అవి కొంతమంది మాత్రమే సంపాదించుకోగలరు. అనేకమంది వాటి కొరకు ప్రయత్నించి విఫలమైన సందర్భాలలో బోడేపూడి వెంకటేశ్వరరావుగారు చక్కగా వాటిని అలవర్చుకున్నారు అందువలననే నాకు ఆయనపట్ల, ఆయనకు నా పట్ల పరస్పర అనురాగము, స్నేహము. ఇదే శాసనసభలో సమస్యలపై చర్చిస్తున్నప్పుడు జోక్యం కలిగించుకోండని ఆయన నాకు చెప్పటం, ఆయనే స్వయంగా జోక్యం కలిగించుకోవటం నాకు గుర్తుకు వస్తోంది. రజోగుణము, సాత్విక గుణములనే రెండు గుణములు ఉన్నాయి. మనము మానవులము, సంస్కారహీనులము కాబట్టి మనకు రజోగుణము సాధారణంగా వస్తుంది. అయితే సాత్విక గుణము సంపాదించుకుంటేనే వస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రతినిధులమైన మనకు వ్యక్తిత్వం ఏమీ ఉండదు కాబట్టి రజోగుణానికి అస్కారం ఉండకూడదు. అందుకు బోడేపూడి వెంకటేశ్వరరావుగారి జీవితమే ఒక ఉదాహరణ. వారు సాత్వికులు కాబట్టి మూడు పర్యాయములు ఈ శాసనసభకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికయ్యారు. వారి సాత్విక గుణమును మనము కూడా అలవరుచుకోవాలనుకుంటున్నాను వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ సిహెచ్. రాజిరెడ్డి (జనగామ):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు పేద రైతుకూలీ కుటుంబంలో పుట్టి పేదల సన్నిధిగా రైతు బాంధవునిగా ఎదిగి సి.పి.ఎం. పార్టీలో రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యునిగానే కాక రైతు ఉద్యమాలలో పాల్గొని సి.కె.సి. సభ్యునిగా దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలలో కొన్ని కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. వారి హఠాత్ మరణం వలన ఒక్క సి.పి.ఎం. పార్టీనే కాకుండా మొత్తం రాష్ట్ర రైతాంగమంతా విచార సముద్రంలో మునిగి పోయింది. వారు అనేక సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాడారు. సిద్ధంపేటలో, కాల్ధరిలో రైతులపై కాల్పులు జరిపినప్పుడు వారు రైతుల తరఫున పోరాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదలు, తుఫాను వచ్చినప్పుడు, రాష్ట్ర కరువు ముంగిట నిలిచినప్పుడు వారు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు జరిపి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. వారు వర్గ సమాజం, దోపిడీ వ్యవస్థ నశించాలని, సంపూర్ణ ప్రజాస్వామ్యం రావాలని ఆశించారు. కళాకారునిగా అనేక విలువైన కళాఖండాలను స్వయంగా వేసి ప్రజలకు అందించారు. మేము శాసనసభలో క్రొత్తగా అడుగుపెట్టిన సందర్భంలో కూడా శాసనసభా పక్ష నాయకుని హోదాలో మమ్మల్ని కూర్చోపెట్టి అనేక సమస్యలను, ముఖ్యంగా పేదల సమస్యలను మాకు వివరించి వాటిని ఏ విధంగా పరిష్కరించాలి, ఏ విధంగా శాసనసభలో ఆయా సమస్యలను లేవనెత్తాలనే విషయాలపై సూచనలు చేసేవారు. మేము మాట్లాడిన ప్రతి సమస్యను శ్రద్ధగా వినటంతోపాటు ప్రతిరోజు మేము మాట్లాడిన అంశంపై లోటుపాట్లు మాతో చర్చించేవారు. మా వరంగల్ జిల్లాలో భూ పోరాటాలు తీవ్రంగా

నడుస్తున్నప్పుడు, పేద ప్రజల గుడిసెలు పీకేసినప్పుడు పేద ప్రజల తరఫున ఆయా పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొనేవారు. అటువంటి వ్యక్తి చనిపోవటం అనేది చాలా బాధాకరమైన విషయం. రైతు సమస్యలు పరిష్కరించే నిమిత్తం వారు "రైతువాణి" అనే మాసపత్రికకు సంపాదకుడిగా ఉంటూ పలు బాధ్యతలు నిర్వర్తించేవారు. వారి మరణం యువతరానికి, రాష్ట్ర రైతాంగానికి తీరని లోటని మనవిచేస్తున్నాను.

11.20 ఉ. శ్రీ వి. శ్రీనివాస రెడ్డి (భాన్సువాడ):- అధ్యక్షా, గౌరవనీయులు, కీర్తి శేషులు బోడేపూడి వెంకటేశ్వరరావు గారి మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ. శ్రీ చంద్రబాబునాయుడుగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. వారు ఒక ఆదర్శవంతమైన నాయకులు. మాలాంటి కొత్త శాసన సభ్యులు ఈ సభలో గత మూడు సంవత్సరాల నుంచి వారి నుంచి ఎన్నో విషయాలను నేర్చుకోగలిగాము. వారు పేదరికంలో పుట్టిన వ్యక్తి కాబట్టి పేదల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి కలిగిన మహానాయకులు. వారిని ఎప్పుడు కలిసినా తాను వయసులో పెద్దవాడిననే భావం లేకుండా మాలాంటి చిన్నవాళ్లని నవ్వుతూ పలకరించేవారు. మేమిద్దరం కూడా కొత్త బ్లాకుల్లో ఉండేవారం. వారు చనిపోడానికి ఐదు రోజుల ముందు లిఫ్టు ఎక్కడానికి వెళుతున్నప్పుడు అప్పటికే లిఫ్టులో వున్న వారు నన్ను చూచి లిఫ్టును ఆపించి నన్ను కూడా తనతో పాటు లిఫ్టులో ఎక్కించుకుపోయారు. అంత శాంత స్వభావం గలవారు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారు. శాసనసభలో కూడా ఎన్నో సందర్భాలలో చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి శాసనసభ గౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి శ్రీ బోడెపూడి వెంకటేశ్వరరావు గారు. వారి మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ పి. రాములు (అచ్చంపేట):- బోడెపూడి వెంకటేశ్వరరావు గారి మరణం పట్ల గౌరవనీయ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. పెద్దలు, గౌరవనీయులు, ఎంతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన వ్యక్తి వెంకటేశ్వరరావు గారు. వారి మరణం మన రాష్ట్రానికి తీరని లోటు. శాసనసభలో ఇటు అధికార పక్షానికి, అటు ప్రతిపక్షానికి కొన్ని సందర్భాలలో సర్దిచెప్పి శాసనసభలో ప్రశాంత పరిస్థితులు నెలకొనడానికి ఎన్నో సలహాలు ఇచ్చిన రాజకీయ దురంధరులు. తన జీవితాన్ని పూర్తిగా కార్మికుల, కర్షకుల, పేద వర్గాల వారి సేవల్లో ఎంతో ఆదర్శవంతంగా జీవించిన వారి ఆదర్శాలను ప్రజాప్రతినిధులు అనుసరించడమే వారికి అందించే నిజమైన నివాళి. వారి మరణం రాష్ట్రానికే తీరని లోటు. వారి మృతి పట్ల వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను.

శ్రీ డి. ఎస్. రెడ్యానాయక్ (డోర్నకల్):- అధ్యక్షా, గౌరవనీయులు, కీర్తిశేషులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారి మరణం పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. వారు మరణించిన రోజు సాయంత్రం నాలుగు, ఐదు గంటల మధ్య వారి మరణ వార్త మాకు తెలిసింది. వెంటనే మా మండల కేంద్రమైన మరిపెడ నుండి ఖమ్మం బయలుదేరి వెళ్లడం జరిగింది.

అప్పటికే మా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకులు శ్రీ పి.జనార్ధనరెడ్డి గారు, శ్రీ ఎమ్.కోదండరెడ్డి గారు, సుజాతానగర్ ఎమ్మెల్యే శ్రీ వెంకట రెడ్డి గారు అక్కడికి వచ్చి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. వెంకటేశ్వరరావు గారు పేద వర్గాల కోసం పోరాడే నాయకులు. వారు నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి. ఎప్పుడూ పేదల గురించి, వారి మంచి గురించి ఆలోచించెడి వ్యక్తి వెంకటేశ్వరరావు గారు. ఒకసారి వెంకటేశ్వరరావు గారు, నేను హైదరాబాదు నుండి ఖమ్మం వరకు ప్రక్కప్రక్కనే కూర్చొని ప్రయాణం చేసే అవకాశం కలిగింది. ఆ సందర్భంలో రాజకీయాలు తదితర విషయాలు మాట్లాడుతూ అవినీతి పెరిగిపోయిందని, అవినీతి తొలగిపోతేనే పేదవారికి మంచి జరుగుతుందని, అందువల్ల అవినీతిని పారద్రోలడానికి కృషిచేయాలని చెప్పారు. దానిని బట్టి పేదల పట్ల వారికి గల ఆప్యాయత అర్థమవుతుంది. వారు ఈ రోజున మన మధ్య లేకపోవడం కమ్యూనిస్టు పార్టీకే గాక మన రాష్ట్రానికి కూడా చాలా నష్టమని నేను భావిస్తున్నాను. వారి ఆకస్మిక మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు, కమ్యూనిస్టు పార్టీకి నా సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

శ్రీ ఎస్.వెంకట వీరయ్య (పాలేరు):-అధ్యక్షా, అమరజీవి బోడేపూడి వెంకటేశ్వర రావు గారి మృతి పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. వారు ఒక నిరంతర ప్రజా సేవకులుగా చనిపోయే వరకు కూడా ప్రజాసేవ చేస్తూ చనిపోవడమనేది చాలా అరుదైన విషయం. వారు యువతరానికి మార్గదర్శకులుగా ఉంటూ వివిధంగా పని చేయాలని సూచనలు, సలహాలు ఇచ్చిన వ్యక్తిగా, ముఖ్యంగా మా ఖమ్మం జిల్లాలో వారు లేకపోవడమనేది గొప్ప లోటు. మధిరలోని ఫ్లోరైడ్ అఫెక్టెడ్ వాటర్ స్కీముకు వారి పేరు పెట్టాలని ముఖ్యమంత్రి గారిని మేము కోరడం జరిగింది. ఖమ్మం ఆడిటోరియానికి కూడా వారి పేరు పెట్టమని విజ్ఞప్తి చేయడం జరిగింది. వారు కూడా ఒక గొప్ప కళాకారులు కాబట్టి ఖమ్మం ఆడిటోరియానికి వారి పేరు పెట్టాలని ముఖ్యమంత్రి గారిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాను, అటువంటి కళాకారుని మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ బద్దం బాల్‌రెడ్డి (కార్వాన్):- శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారి మరణానికి సంతాపం తెలిపే తీర్మానాన్ని ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టడాన్ని మా పార్టీ బలపరుస్తున్నది. వారితో గత 1985వ సంవత్సరం నుండి ఈ శాసన సభలో నాకు పరిచయం. ప్రభుత్వం నియమించిన హౌస్ కమిటీలలో వారితో పాటు కలిసి పనిచేయడం, పర్యటించడం జరిగింది. అందువల్ల వారితో చనువుగా మాట్లాడే అవకాశం కలిగింది. వారు నిరాడంబర జీవితం గడిపిన వ్యక్తి. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి. వారు రైతుల కోసం, పేద, బడుగు వర్గాల వారికోసం నిరంతరంగా పోరాడిన వ్యక్తి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పేదవారి కోసం ఆ పార్టీతో పోరాటం చేసి పేదవర్గాల వారి కోసం

కృషిచేశారు. ఈ రకంగా నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి ఆయన. చివరి శ్వాసవరకు తన నియోజకవర్గం కొరకేగాకుండా రాష్ట్ర ప్రజలందరి కోసం నిరంతరంగా పోరాటం సలిపిన వ్యక్తిని పోగొట్టుకున్నాం. ఆయన చూపిన బాటలో నడుచుకోవడానికి, ఆయన ఆదర్శాలను పాటించడానికి మనం ప్రయత్నం చేయాలి. కమ్యూనిస్టు పార్టీలో వున్నప్పటికీ, క్రమశిక్షణ కలిగిన ఫ్లోర్ లీడర్ ఆయన. అటువంటి ప్రజానాయకుణ్ని ఈ శాసనసభలో మనం అరుదుగా చూడవచ్చు. ఇంతేగాకుండా గతంలో వరదలు వచ్చినపుడు మేము ఆయనతో కలిసి భద్రాచలంలో పర్యటించడం జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావుగారు హెలికాప్టర్‌లో వచ్చి అక్కడి గెస్ట్‌హౌస్‌లో దిగినపుడు, అక్కడి ప్రజల కష్టనష్టాలను వివరిస్తూ బోడేపూడిగారు ఒక మెమోరాండమ్‌ను ముఖ్యమంత్రికి సమర్పించడం పట్ల ఆయనకున్న శ్రద్ధాశక్తులను మనం గుర్తించవచ్చు. ఆయన అనారోగ్యంగా వున్నప్పటికీ సభలో వచ్చి కూర్చోవడమేగాకుండా ప్రజల సమస్యలపట్ల స్పందించడం మనం చూశాం. కాబట్టి అలాంటి వ్యక్తులు ఏ పార్టీలో వున్నప్పటికీ మనం వారి సేవలను గుర్తించాలి. బోడేపూడి వెంకటేశ్వరరావుగారు మన రాష్ట్రంలో బోడేపూడి గా ప్రసిద్ధి చెందారు. ఆయన మరణంతో మన రాష్ట్రం దు:ఖసాగరంలో మునిగిపోయింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ. నాకు ఈ అవకాశాన్ని యిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ ముగిస్తున్నాను.

Dr.G.Vijaya Rama Rao (Gajwel):- Speaker Sir, I rise to support the condolence motion moved by our Hon'ble Chief Minister. Although, I had a very short association with Bodepudi Garu, I could find a great personality in him among all the politicians, particularly, in the Communist party. Eventhough, he was running old age he responded well in this House in every critical situation by making an impartial observation. All the time he represented the aspirations and the needs of the poorer sections, partticularly, the farming community. Mr.Bodepudi Garu is known for his hard working, sincerity and discipline. He hailed from an utmost rural village but for his hard working and discipline he was elevated to this august House. His personality, his commitment and his hard working in an exemplary for all the young parliamentarians and legislators. I extend my deep sympathy and sorrowness to the members of the bereaved family.

శ్రీ డి.అప్పలసూర్యనారాయణ (శ్రీకాకుళం):- అధ్యక్షా, స్వర్గీయ పెద్దలు బోడేపూడి వెంకటేశ్వరరావుగారి మరణంపట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, అదే సందర్భంగా మంచినీటి పథకానికి ఆయన పేరు పెడతామని మన ముఖ్యమంత్రిగారు ప్రకటించడంతోబాటు ఏమయినా పక్కని ఆలోచనలు, సలహాలు చెబితే,

వాటిని పరిశీలించి ఆయన పేరు పెడతామని ముఖ్యమంత్రిగారు చెప్పడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. బోడేపూడిగారు, నేను ఈ హౌస్‌లో ఒకేసారి ప్రవేశించడం జరిగింది. మొదటినుంచి కూడా పెద్దగా విద్యావంతులు కాకపోయినా, అదే సందర్భంలో మనందరిచేత ఆకర్షింపబడిన వ్యక్తిని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. తుది శ్వాస వరకూ పార్టీ లక్ష్యాలకోసం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారు. ఆయన గడిపిన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి కుటుంబ సభ్యులు కూడా అదేవిధంగా యిపుడు నడుచుకుంటున్నారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఆయన ఆత్మ సంతోషంగా వుండాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశాన్నిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

Sri K.R. Suresh Reddy (Balkonda):- Speaker Sir, with the sad demise of Bodepudi Garu, the Madhira constituency which he represented has lost his beloved leader, the C.P.I.(M) have lost a disciplined comrade and this Assembly will miss his presence. As a communist leader he fought on many issues including the land reforms. In his long and turbulent political career he fought and participated in the freedom struggle and experienced the euphoria of independence, saw the dark famine years and appreciated the liberalisation policy. In all these phases of his political life his participation was vibrant.

Mr. Bodepudi Garu never missed an opportunity to congratulate the Government as was seen in 1992-93 budgetory demands wherein he appreciated the then Government of India's new economic reforms. At the same time he never failed to caution the Government whenever they deviated from their path. This we have seen recently where he opposed the power crisis, power bill and also the closure of Allwyn. He was very actively and very keenly interested for the development of backward areas. During the last eight years I had the pleasure to listening to him and to talk to him and he always appreciated any movement brought forward for the development of backward areas. All these movements are cherishable and memorable in my life. I appreciate the gesture of the Hon'ble Chief Minister in naming the

Protected Water Supply Scheme in flouride affected areas after this great leader and would also request the Hon'ble Chief Minister to continue the various programmes undertaken by the late leader.

Speaker, Sir, recently the family members of Bodepudi Garu lost him physically but they have sacrificed him many, many years ago as he was actively engaged in taking up various schemes, denying his attention to his family members. On behalf of the Congress Legislature Party and on my behalf, I support the condolence motion moved by the Hon'ble Chief Minister and express our condolences to the members of the bereaved family.

శ్రీ వై. కిష్టారెడ్డి (కల్వకుర్తి):- అధ్యక్షా, కీర్తిశేషులు. గౌరవనీయులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారి మృతి పట్ల గౌరవ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. కార్మికులు, కర్షకులు మరియు శ్రామికజీవుల శ్రేయస్సుకోసం తన జీవితాన్ని పణంగా పెట్టి కృషి చేసి పోరాడిన మహానాయకుడు బోడేపూడి గారు. నేను మొదటిసారిగా శాసనసభలో ప్రవేశించిన తర్వాత వారి ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవడం జరిగింది. వారు చర్చల్లో పాల్గొన్నపుడు పాలకపక్షానికిగాని, ప్రతిపక్షానికిగాని ప్రజల ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో చెప్పిన విషయాల పట్ల నేను చాలా ఆకర్షితున్ని అయ్యాను. ఆయనకు గొప్ప సంస్కారం వుంది అన్నిటికంటే మిన్నగా మంచి క్రమశిక్షణ వుంది. ఆయనకున్నటువంటి ఈ మంచి లక్షణాల వల్ల నేను ఆకర్షితున్ని అయ్యాను. వయసులో చిన్నవాడిని అయినప్పటికీ బయట పలకరించినపుడు ఎంతో అప్యాయతతో నన్ను పిలిచి నేను చెప్పింది విని సరైన సలహాలు యిచ్చినటువంటి మహానాయకుడు. ఈనాడు మన మధ్యలో లేకపోవడం సి.పి.ఎం. పార్టీకి, ఆయన కుటుంబానికి మరియు రాష్ట్రానికి తీరని లోటు. పాలకపక్షం ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకొన్నపుడు నిర్భయంగా మాట్లాడి సూచనలు యివ్వడం, ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వాలు నడుచుకునేవిధంగా ఒత్తిడి తీసుకొనివచ్చిన మహానాయకుడు ఆయన. వారి సిద్ధాంతాలను అమలుపరచి, ఆయన ఆశయాలను ముందుకు తీసుకపోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢసానుభూతిని తెలియజేస్తూ, నాకు అవకాశం యిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

11·40 ఉ· శ్రీ ఆర్·వెంకటరెడ్డి (సుజాతనగర్):– అధ్యక్షా, మా జిల్లాలో మంచికి మారుపేరు అంటే శ్రీ బొడెపూడి వెంకటేశ్వరరావు అంటారు· ఆయన 1924లో మధిర తాలూకా,వైర మండలంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు· ఆయన పాలేరుగా జీవితాన్ని ప్రారంభించి యీనాడు మూడు పర్యాయాలు మధిర తాలూకా నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రతిపక్షనాయకుని హోదాలో పనిచేశారు· ఈనాడు మన మధ్యలో లేడు· వారి కుటుంసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన కాంగ్రెసు పార్టీ తరఫున బలపరుస్తూ నాకు యీ అవకాశం ఇచ్చిన పెద్దలకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను·

మిస్టర్ స్పీకర్:– ఆంధ్రప్రదేశ్ శాసనసభ శ్రీ బోడెపూడి వెంకటేశ్వరరావుగారి మృతి పట్ల యీ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియచేస్తున్నది· ఆయన రైతు బాంధవుడు, తెలంగాణా సాయిధ పోరాట యోధుడు, సి·పి·ఎం· శాసనసభాపక్షం నాయకుడు, మృధు భాషి, నిరాడంబరుడు అయిన శ్రీ బొడెపూడి వెంకటేశ్వరరావుగారు 1985 నుంచి 1989 వరకు మరియు 1994 వరకు వరుసగామూడు సార్లు మధిర నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు· వీరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులుగా పలు పదవులు నిర్వహించారు· తెలంగాణా విముక్తి కోసం ఎంతో పాటుపడ్డారు· కర్షకులు, కార్మికులు, దళితులు, బడుగు వర్గాల ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారు· శాసనసభలో పలు ప్రజా సమస్యలను నిర్భయంగా నిర్మొహమాటంగా ప్రస్తావించి, వారి పరిష్కారం కోసం పోరాడారు· వీరు గత కొన్ని రోజులుగా అస్వస్థులుగా వుండి, 1997 ఆగస్టు 5వ తేదీన మరణించారు· వీరి వయస్సు 75 సంవత్సరాలు·వీరి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటిద్దాం·

(సభ రెండు నిముషాలు మౌనం పాటించింది)

(The House then adjourned at 11.40 a.m. to meet again at 9.00 a.m. on Tuesday, the 18th November, 1997)

Published under Rule 310 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.